# ఉండనీ జంటగా

కొరుకొండ సత్యానంద్



**ఇంటిలోనూ,** వీధిలోనూ వెంకట్రావునీ అందరూ మంచివాడూ, మెత్తనివాడూ అంటారు. రెండు మాటలు మాట్లాడితే గొప్ప అంటారు. విశ్వనాథ్, మణిరత్నం సినిమాలకు మాటల రచయితగా పనికొస్తాడంటారు.

వెంకట్రావు భార్య అనసూయ కాపురానికికొచ్చిన కొత్తలో వనం మారిన లేడిలా బెదిరింది. జరుగుతున్న సంఘటనలకు ఆలోచనలు కదిలినప్పుడు అనసూయ అభిప్రాయాలు మాటల రూపంలో బయటకొచ్చేవి. అనసూయ అన్న మాటల్ని ఎవరైనా చెప్పినప్పుడో, తనే విన్నప్పుడో, అనసూయా తనతో అన్నప్పుడో వెంకట్రావు సందర్భానుసారంగా కొన్ని విషయాల్ని వివరించేవాడు.

"... అనసూయా, అమ్మా నాన్నలు అందరికంటే నన్నే అల్లారు ముద్దుగా పెంచేరు. ప్రేమనెక్కువ నాకే పంచేరు. ఆ ప్రేమ నీ మీద కూడా ఉంటుంది. అది నా నమ్మకం. నిజం కూడా....

అమ్మ ప్రేమే ఆడవాళ్లనలా మాట్లాడిస్తుంది. తనస్థానాన్ని కోడలు ఆక్రమిస్తుందేమోనని తల్లి భయపడుతుంది. ఆ భయానికి సంకేతాలే అమ్మ మాటలు. అంతేగానీ నిన్నొక బానిసలాగానో, పరాయిదానిలాగానో చూడ్డం కాదు. మనం ఆనందంగా ఉంటే ఈర్ష్య పడ్డమూ కాదు....

"....నువ్వు పెద్ద కోడలివి. పెద్దరికానికి హక్కులకంటే బాధ్యతలే ఎక్కువ ఉంటాయి. మెదడుతో కంటే మనసుతోనే ఎక్కువ ఆలోచించాల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులు ఎవ్వరూ పోటీ పడకూడదు. పోరాటం సలపకూడదు. 'ఇది మా కుటుంబం' అనే ఆరాటం ఉండాలి. దాన్ని అందరికీ నీవే నేర్పాలి. నేర్పే ప్రతివాళ్లకీ నేర్పూ, నైపుణ్యమే కాదు. ఓర్పు కూడా ఉండాలి....

"వరండాలో నాన్న పేపర్తోనో, పిల్లల్తోనో- వంట గదిలో అమ్మ ఏదో అందిస్తూనో, అంటూనో... వాళ్లు లేకపోతే ఇంటికి కళ వస్తుందా. మనకి నలుగురు పిల్లలు అనసూయా. ఇద్దరు మగపిల్లలు. ఇద్దరు ముసలిపిల్లలూనూ...."

వెంకట్రావు మాటలకు అనసూయ ఆలోచనల్లో మార్పు వచ్చింది. పెదవి కదిపే ముందు ఆలోచించడం మొదలుపెట్టింది. అవసరమైతే భర్త సలహా తీసుకొనేది. అతనిలో ఏ దేవత మార్దవాన్ని నింపేదో... ఆ గొంతు పలికే మాటలకు అనసూయలో ఆవేశమూ, ఉద్వేగమూ తగ్గిపోయేవి. కుటుంబం పట్ల ఆపేక్ష పెరిగింది. అందరూ 'తనవారు' అన్న భావన కలిగింది. అది క్రమంగా పెరిగింది. అప్పటికి మిగిలి ఉన్న ఆడపడుచుల పెళ్లిళ్లల్లో వాళ్లకు తల్లిగా మసిలింది. తన కూతుళ్లు అత్తవారిళ్ళకు వెళ్లినట్లే కన్నీరు పెట్టుకుంది. వాళ్లొచ్చినప్పుడు అంకిత భావంతో పెట్టుపోతల విషయకం చూసింది. వాళ్ల పురుళ్లలో, పథ్యాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొంది.

అత్త మామలు ఇంట్లో ఉంటే తన కన్న వాళ్లకంటే ఎక్కువ మక్కువతో చూసింది. వాళ్లు మరుదుల ఇళ్లకు వెళ్తుంటే వెంటనే వచ్చేయమని మనస్ఫూర్తిగా చెప్పింది. తోడికోడళ్లు తమ పట్ల ప్రవర్తనలో లోపాలు అత్తగారు చెప్పినప్పుడు ఆమెని ఓదార్చింది. వాళ్ల ప్రవర్తన పసిపిల్లల ప్రవర్తనగా సర్ది చెప్పింది.

మామగారు పోయినప్పుడు అత్తగారు ఏడ్చిన విధానం చూసి అనసూయకి అన్పించింది, తనకు అప్పుడెప్పుడో 'పైకి మరోలా కన్పించే అత్తగారిలో ప్రేమపాశాలు ఇంతటి విశ్వరూపంలో ఉన్నాయా' అని..,

అత్తగారు పోయినప్పుడు భర్త గంభీర మౌనానికి భయపడింది. కురవని కన్నీళ్లు గుండెలో సుళ్లు తిరిగి ఎక్కడ హృదయనాళాల్ని మెలి పెడతాయో అని కలవరపడింది. పోతూ పోతూ తన నుదట మీద అత్తగారు పెట్టిన ముద్దుతో అర్థమయ్యింది. అత్తగారు ఆశించిన ప్రేమ తను సంపూర్ణంగా అందించినందుకు అంత అందంగా తన కృతజ్ఞతను తెలిపిందని.

తను అతి జాగ్రత్తగా పెంచిన మొక్క మహావృక్షమయ్యాక ఆ వృక్షం నీడలో హాయిగా కూర్చొనే వ్యక్తిలా ఉన్నాడు వెంకట్రావు. అతనికిప్పుడు ఏ బాదర బందీ లేదు. అన్నీ అనసూయే చూసుకుంటుంది.

అందుకే వెంకట్రావిప్పుడు అందరి దృష్టిలో ఎక్కువగా మాట్లాడని వాడు, నెమ్మదస్తుడూ అయ్యాడు. అనసూయ తెలివి తేటలూ, చాకచక్యమూ ఉన్నదయ్యింది.

కాలం కదుల్తో ప్రతి మనిషిలోనూ దశల పదనిసలను ఆరోహణ క్రమంలో ఆలాపిస్తోంది.

వెంకట్రావు రిటైరయ్యాడు. రిటైరయ్యే ముందు పెద్ద కొడుకు సాగర్‌కి, అయ్యాక చిన్న కొడుకు విజయ్‌కీ ఉద్యోగాలొచ్చేయి. ఉద్యోగాలు రావడంలో శ్రమంతా కొడుకులదే. అవి ఒకే ఊళ్లో రావడంలో మాత్రం వెంకట్రావు కృషి ఉంది.

రిటైరైన డబ్బుతో రెండు పోర్షన్ల ఇల్లు కట్టేడు. ఒక పోర్షన్లో అందరూ ఉన్నారు. రెండో పోర్షన్ని అద్దెకిచ్చేడు. పెన్షను రాని ఉద్యోగంలో రిటైరైన వెంకట్రావు ఆ అద్దెనే పెన్షననుకున్నాడు. దాన్ని అనసూయకే ఇచ్చేవాడు. అనసూయ ఆ డబ్బుని ఇంట్లోకి ఖర్చు చేసేది. అది అయిపోయాక కొడుకుల నుండి అవసరమైన డబ్బునే అడిగి తీసుకొనేది. వాళ్ల జీతాల లెక్కలు, ఖర్చులు అనసూయగానీ వెంకట్రావుగానీ అడిగేవారు కాదు. ఉద్యోగాలొచ్చిన

కొత్తలో జీతాలు చేతుల్లో పెడితే అందుకొని తిరిగి వాళ్లకే ఇచ్చేవారు. ఆ తర్వాత లెక్కలు చెప్పబోతుంటే వారించేవారు.

"మాకు అందించాల్సింది మీ ప్రేమని. జీతాల్ని కాదు. ఇంటి అవసరాలు మీకు తెలుసు. అవసరమైనంత అడుగుతాను. ఇవ్వండి చాలు..."

"మా అమ్మాయిని మీ అబ్బాయికి ఇవ్వడానికి అడగడానికొచ్చాం" - అని ఎవరో వచ్చేవరకూ కొడుకులకి పెళ్లీడు వచ్చిందని అనుకోలేదు. కొడుకుల్నింకా పసివాళ్లగానే లాలించే వారింతవరకూ.

పెద్ద కొడుకు సాగర్‌కి సంబంధం కుదిర్చారు. ఒకమ్మాయి అనసూయకు నచ్చింది. ఆ అమ్మాయే వెంకట్రావుకీ నచ్చింది. ఆ అమ్మాయినే చేసేద్దామంది అనసూయ. జీవితాంతం కలిసి కాపురం చేయాల్సింది కొడుకు కాబట్టి, కొడుకుని అడిగి చేద్దామన్నాడు వెంకట్రావు. 'మన ఇష్టమే వాడి ఇష్టం అంటాడు చూడండి' అంది అనసూయ. 'అవుననుకో, కానీ అడగాల్సిన బాధ్యత మనకుంది కదా'అని అన్నాడు వెంకట్రావు.

సాగర్‌తో 'ఈ అమ్మాయి మాకు నచ్చింది' అన్నారు. కొడుకు అభిప్రాయం అడిగేరు. తనకూ నచ్చింది అన్నాడు సాగర్. 'అయితే ముహూర్తాలు పెట్టేసుకుందామని కబురు చేసేద్దాం' అన్నాడు వెంకట్రావు. కానీ సాగర్ వద్దన్నాడు. వెంకట్రావు, అనసూయ ఆశ్చర్యంగా అడిగారు ఎందుకని.

'...ఈ అమ్మాయి బాగుంది. నాకు నచ్చింది. పెళ్లి చేసుకుంటాను. కానీ మరో రెండు మూడు సంబంధాలు కూడా చూడండి. ఈ అమ్మాయికున్న అర్హతలన్నీ, ఉండి అదనంగా ఆస్తిపాస్తులు అధికంగా ఉండే అమ్మాయి దొరికితే ఆ అమ్మాయిని చేసుకుంటాను. దొరక్కపోతే ఈ అమ్మాయిని చేసుకుంటాను..."

అలా మాట్లాడుతున్న పెద్ద కొడుకు వైపు కళ్లింత చేసుకొని చూస్తూ ఉండిపోయారు చాలా సేపు అనసూయా వెంకట్రావులు. సాగర్ చెప్పిన లక్షణాలు ఉన్న అమ్మాయి దొరికింది. ఆ అమ్మాయే వాళ్లింటి పెద్ద కోడలయ్యింది.

ఆ మరు సంవత్సరంలో చిన్నబ్బాయి విజయ్‌కి సంబంధాలు చూడ్డం మొదలు పెట్టేరు. ముందుగా విజయ్‌కి ఎలాంటి అమ్మాయి కావాలని అడిగారు. 'నాకు ఎలాంటి అమ్మాయైతే బాగుంటుందని మీరనుకుంటున్నారో ఆ అమ్మాయినే చేయండి. అయితే మీరు సంతృప్తి పడ్డంలో మాత్రం రాజీ పడకండి' అన్నాడు.


చిన్నకొడుకు అలా ఎందుకన్నాడో అర్థం చేసుకున్నారు అనసూయా వెంకట్రావులు. పెద్ద కోడలు అప్పుడప్పుడూ ప్రవర్తించిన విధానం, అన్న మాటలు ఆ ఇంట్లో చిన్న చిన్న దుమారాల్ని రేపింది. ఆ సందర్భాల్లో రెచ్చిపోయిన విజయ్‌ని వారించేది అనసూయ.

'...వదిన తల్లిలాంటిది. నాకు గౌరవం ఇచ్చినంత మాత్రాన నువ్వు మంచి కొడుకువి అయిపోవు. వదిననూ నాలాగే చూడాలి.

'కొత్త ప్రదేశం. కొత్త మనుష్యులం. అత్తింట్లో అడుగు పెట్టిన ఆడపిల్లలో కలిగే అలజడికి ప్రతిరూపమే వదిన ప్రవర్తన. నీ కంటికి మంచిదానిలా కనిపించే మీ అమ్మ కూడా కొత్తలో అత్తారింట్లో ఆ అలజడికి గురయ్యింది. తికమకపడిపోయి తొందర పడింది. పరిస్థితులు, మనస్తత్వాలూ, అర్థమైతే వదిన నాకంటే మంచిదవుతుంది...

ఆ సంవత్సరంలో విజయ్‌కు కూడా పెళ్లి చేసేశారు. ఆ ఇల్లు ఇప్పుడు సంపూర్ణంగా కన్పించింది అనసూయా వెంకట్రావులకి. 'మనుమలు మనుమరాళ్లు కూడా వచ్చాకే ఇంటికి అసలైన ఆనందం వెల్లి విరుస్తుంది' అని అన్పించింది మళ్లీ వాళ్లకి. ఆ రోజు కోసమే వాళ్లిద్దరూ ఎదురు చూస్తున్నారు.

కానీ ఆ రోజు రానేలేదు. అకస్మాత్తుగా ఊహించని రోజొకటి వచ్చి పడిపోయింది!




నివురు గప్పిన నిప్పు ఒక్కసారిగా రాజుకుంది తోడికోడళ్ల నడుమ. అది ఆర్పడానికి వీలులేనంత వేగంగా పెద్దదై పోయింది. అంత పెద్దదై పోవడానికి కారణం ఆ అగ్నికి ఆజ్యం పోసుకున్నారు అన్నదమ్ములిద్దరూ అనవసరంగా, అనాలోచితంగా.

అదుపు తప్పిన అగ్నినార్పడానికి ప్రయత్నిస్తే ఒళ్లు కాలుతుంది. అనసూయా వెంకట్రావులు అదే చేశారు. వాళ్లకి ఒళ్లు కాలలేదు గానీ మనసు కాలిపోయింది. జరిగిన విషయాల్ని కూలంకషంగా చర్చిస్తే కొన్ని విషయాల్లో ఒక జంటకీ, మరికొన్ని విషయాల్లో రెండో జంటకీ చెడ్డవాళ్లై పోయారు. అందరి కందరూ చెడ్డవాళ్లై పోయారు. ఎవర్నీ చెడ్డవాళ్లు అనుకోనిది అనసూయా వెంకట్రావులే.

కానీ అది అక్కడితో ఆగింది కాదు!

రెండు నెలల కాలంలో అన్నదమ్ములిద్దరూ ఒకరికి తెలియకుండా మరొకరు ప్రయత్నించుకున్నారు. రెండు రోజుల తేడాతో తనకి ట్రాన్స్‌ఫరయిందని, భార్యతో వెళ్లిపోతున్నానని ఇద్దరూ విడివిడిగా తల్లిదండ్రులకు చెప్పేరు. ఒకరి విషయం ఒకరికి తెలిసి ఒకళ్ల వైపొకరు చూసుకున్నారు ఆశ్చర్యంగా.

'వెళ్లి పోయేవాడ్నని చెప్తే నేనిక్కడే ఉండిపోయే వాడినిగా పీడ వదిలిందని.'

'నువ్వే చెప్పలేకపోయావా. గబ్బు పోతోందని హాయిగా ఇక్కడే ఉండేవాణ్ని.'

'పెళ్లాం చాటు పెద్దవ్వి. ఒక్కమాట చెప్పేడవ లేకపోయావా?'

'చచ్చు సన్నాసివి. నీకు చెప్పేదేమిట్రా. చెప్తే నాకంటే ముందు వెళ్లిపోయి ఒక్కడివే పెళ్లాంతో కులుకుదామనుకున్నావా?'

'ఇప్పుడేం చేద్దాం అయితే అమ్మానాన్నల్ని?'

'వాళ్లని తీసుకెళ్లిపోదాం.'

'నువ్వు తీసుకెళ్లు. పెద్దవాడివిగా.'

'నాది నీలా కాళ్లూపుకొని కూర్చొనే ఉద్యోగం కాదు.'

'అందుకే నీకు సాయంగా ఉంటారు. నువ్వే తీసుకెళ్లు.'

'చిన్నవాడివైనా చాలా తెలివి తేటలు నేర్చావు. నీకు ఉద్యోగం రాకముందు నేను ముగ్గుర్ని పోషించేను. అందుచేత నువ్వే తీసుకెళ్లు.'

"ముందు నీకు పెళ్లయ్యింది. నీ పెళ్లాం తిన్నదాంట్లో నా జీతమూ కలిసింది."

"ఆ మాత్రం లెక్కలు నాకూ వచ్చు. నా చదువులకి అయిన ఖర్చుకంటే నీ చదువులకే ఎక్కువ ఖర్చయింది. నాకు మొదటి ఇంటర్వ్యూలోనే ఉద్యోగం వచ్చింది. నీవి మొత్తం పది ఇంటర్వ్యూలు. ఎంత ఖర్చయిందో లెక్కలు వేసుకో. నాలుగు ఇంటర్వ్యూలకి ఖర్చులకి నేనే కదా ఇచ్చేను మరచి పోయేవా"

'నువ్వు నాకంటే నాలుగేళ్ల ముందు పుట్టేవు. ఆ నాలుగేళ్లకీ ఎంతవుతుంది ఖర్చు! పెద్దకొడుక్కి జరిగినట్లు చిన్నవాడికి జరుగుతుందా? లెక్కలేస్తే చాలా వస్తాయి.'

ఏదైనా పెడితే 'అమ్మా అన్నయ్యకో' - నాన్నా తమ్ముడికో' అని అడిగే అన్నదమ్ములిద్దరూ అలా మాట్లాడు కుంటుంటే తెల్లబోయి చూస్తూ ఉండిపోయారు అనసూయా వెంకట్రావులు.

'ఏం చేద్దామో చెప్పు.'

'నువ్వే చెప్పు.'

'ఆర్నెల్లు నీదగ్గర. ఆర్నెలు నా దగ్గరయితే.'

'అయితే ముందు ఎవరి దగ్గర?"

'నీ దగ్గర.'

'కాదు నీ దగ్గర.'

'పెద్దవాడివి. ముందు నీ దగ్గర.'

'ఇప్పుడు నా పరిస్థితి బాగోలేదు. నీ దగ్గరే ముందు.'

'అదేదో అమ్మా నాన్నల్నే అడుగుదాం.'

సాగర్, విజయ్ ఇద్దరూ అనసూయా వెంకట్రావుల ఎదురుగా నిలబడ్డారు.

'ముందు ఎవరి దగ్గర ఉంటారమ్మా?'

'అన్నయ్య దగ్గర ఉంటారామ్మా?'

'తమ్ముడి దగ్గర ఉంటారామ్మా?'

అనసూయా వెంకట్రావులకు ఏమనాలో తెలియలేదు. అప్పటికప్పుడే ఆకాశాన్ని మబ్బులు కమ్మేసి వానగా మొదలై జడివానై ఊళ్లకు ఊళ్లనే

ఊడ్చుకుపోయిన దృశ్యాన్ని చూస్తున్న వారిలా ఉండిపోయారు. ముందుగా తేరుకుంది అనసూయ.

'మీ ప్రశ్నలకు ఏ తల్లిదండ్రులూ సమాధానాలు చెప్పలేరురా'

'కానీ చెప్పక తప్పదు. నాన్నా మీరు చెప్పండి'

'అడగడానికి మీకు వచ్చిన నోరు సమాధానం చెప్పడానికి నాకు రావడం లేదురా'

'నోరు రాకపోతే సైగల్లో చెప్పండి'

అలా అన్న పెద్ద కొడుకుని చాచిపెట్టి కొట్టాలనుకుంది అనసూయ. కానీ అల్లరి చేసిన చిన్నప్పుడే ఆ పని చేయలేదు. చెట్టంత ఎదిగిన వాడిన్ని, కొడుకు నుండి భర్తగా ఎదిగిన వాడిని ఎలా కొట్టగలదు?

అంతలో పెద్ద కోడలు భర్తకి సైగ చేసింది రమ్మన్నట్టు. సాగర్ భార్య దగ్గరకు వెళ్లాడు. ఇద్దరూ గదిలోకి వెళ్లి కాసేపటికి బయటికి వచ్చారు.

'అమ్మా. అందరికీ వీలయ్యేదొకటి నేను చెప్తాను'

'ఏమిటీ ముందు నువ్వే తీసుకెళ్తావా'

అలా అడుగుతున్న విజయ్‌ని భార్య పిలిచింది. ఇద్దరూ గదిలోకి వెళ్లి కాసేపట్లో వచ్చారు.

'అమ్మా మా ఆలోచన మారింది'

'ఏమిట్రా. ఎవరూ వెళ్లడం లేదా'

'ట్రాన్స్‌ఫర్లు కాన్సిల్ చేయించుకోవాలనుకుంటున్నారా. ఇప్పటికైనా మించిపోయిందేం లేదురా. తెలిసిన వాళ్లతో చెప్పి ఎలాగో ఆపు చేయిస్తాను'

తల్లి దండ్రులను దైవాలుగా చూస్తారు కొంతమంది కొడుకులు. కానీ అలా అడిగిన తల్లిదండ్రులను వెర్రివాళ్లుగా చూశారు ఆ కొడుకులు.

'ఆరేసి నెలల చొప్పున మిమ్మల్ని మా దగ్గర ఉంచుకోవడంలో అర్థం లేదు. మీ ఇద్దర్నీ చూసుకోవాల్సిన బాధ్యత మా ఇద్దరికీ ఉంది. అందుకే మీ రిద్దరూ ఎప్పుడూ మా దగ్గరే ఉండాలి'

విజయ్ చెప్తున్న మాటలు తల్లిదండ్రులకి సరిగా అర్థం కావడం లేదని అర్థమైంది సాగర్‌కు. అందుకే తమ్ముడ్ని ఆగమన్నాడు. తమ్ముడికి చెప్పడం రావట్లేదని విసుక్కున్నాడు.

'అమ్మా. మాకు మీ ఇద్దరూ కావాలి. మిమ్మల్నిద్దర్నీ విడిచి మేమెప్పుడైనా ఉన్నామా. మా ఆవిడకీ, మరదలికీ ఉన్న తెలివితేటలు తమ్ముడికీ నాకూ లేకపోయాయి. మీరిద్దరూ సంవత్సరమంతా మా దగ్గర ఉండాలి'.

మధ్యలో మళ్లీ విజయ్ అందుకున్నాడు. అన్నయ్యకి చెప్పడం అసలు రాదన్నాడు. చెప్పడంలో తానే నయమన్నాడు.

'ఏ నెల నుండి ఏ నెలైనా ఆరు నెలలు నా దగ్గర. తర్వాతి ఆరు నెలలు అన్నయ్య దగ్గరా ఉండాలి. నువ్వు నా దగ్గరుంటే నాన్న వాడి దగ్గర ఉంటారు. ఆర్నెల్లు పూర్తయ్యాక నాన్న నా దగ్గరకొస్తారు. నువ్వు వాడి దగ్గరకెళ్తావు'.

ఒకకెరటం విరిగి పడినట్లయ్యింది అనసూయా వెంకట్రావులకి. ఇద్దరు పసిపిల్లలు కళ్లముందు పెరిగి రాక్షసులై వాడి గోళ్లతో గుండెల్ని చీల్చుతున్నట్ల నిపించింది.

'ఏమయ్యిందిరా మీ ఇద్దరికీ. మీరిద్దరూ పాలని నా రెండు గుండెల్లోంచి పీల్చుకున్నార్రా! అప్పుడే మీకీ తెలివుంటే చెరో గుండెనీ పంచుకునే వారేమో కదురా. ఏవండీ! చూడండీ! మన పిల్లలు మనల్ని పంచుకుంటున్నారు. మనం వీళ్లని చిన్నప్పుడు అన్నం కలిపి పెట్టడానికి పంచుకున్నామా. పోటీ పడ్డాం కానీ. పక్కలో పడుకోబెట్టుకోడానికి పంచుకున్నామా. ఇద్దర్నీ పెనవేసుకున్నాం గానీ. వీళ్లు బడికో, బయటికో వెళ్లినప్పుడు కూడా మనిద్దరి కళ్లల్లోనూ కదలాడలేదూ. ఎవరు రావడం ఆలస్యమైనా మన కళ్లల్లో కన్నీళ్లొలుక లేదూ'?


అనసూయ ఎన్ని అన్నా వెంకట్రావేమీ మాట్లాడలేదు. కళ్ల ముందే అన్నీ జరిగి పోతున్నా అనసూయను పొదివి పట్టుకొని చూస్తూ ఉండి పోయాడు.

వారం రోజులైంది. ఇంట్లో సామాన్లు పంచుకొని మూటలు కట్టేసుకున్నారు కొడుకులిద్దరూ. ఇప్పుడు వాళ్లుంటున్న ఆ పోర్షన్ అద్దెకివ్వడానికి అడ్వాన్స్ పుచ్చేసుకున్నారు. రెండు వేన్లు మాట్లాడేరు. వాళ్ల వెళ్లబోయే ఊళ్లకు ముందుగా వెళ్లి ఇళ్లు చూసుకున్నారు. ఒకరు తల్లిని కలిపి, మరొకరు తండ్రిని కలిపి రైలు టికెట్లు రిజర్వ్ చేయించేసేరు.

ఈ వారం రోజులూ భర్త బలవంతం మీద ఏం తిన్నదో ఏం తాగిందో...

తన భర్తనీ, తననూ పంచుకుంటామని కొడుకులు చెప్పిన రోజు హిస్టీరిక్‌గా ఏవేవో మాట్లాడి కళ్లు తిరిగి పడిపోయిన తర్వాత ముఖం మీద భర్త నీళ్లు జల్లితే స్పృహలోకి వస్తోండగా ఎదురుగా కన్పించిన దృశ్యమే ఆమెకు మళ్లీ మళ్లీ కళ్లల్లో కదలాడుతోంది.

సాగర్, విజయ్ ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు. తను అరచి, ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయినా వాళ్ల మాటలు కొనసాగించినట్లుగానే ఉన్నారు.




'మనం వాదించుకోవడం అనవసరం. ఇందాక అమ్మానాన్నల్ని ముందెవరు తీసుకెళ్లాలని వాదిస్తూ టైమ్ వేస్ట్ చేశాం. ఇప్పుడలా కాదు. అమ్మ ఎవరి దగ్గరో, నాన్న ఎవరి దగ్గరో తేల్చుకోడానికి ఒక ఉపాయం చెప్తాను'.

సాగర్ జేబులోంచి రూపాయి బిళ్ల తీశాడు. తర్వాత తమ్ముడి వైపూ, భార్య, మరదలి వైపు చూశాడు.

'నేను బొమ్మ కోరుకుంటాను. నీది బొరుసు. బొమ్మ పడిందనుకో. అమ్మ ముందు నా దగ్గరుంటుంది. బొరుసు పడిందనుకో. నాన్న ముందు నా దగ్గరుంటారు'.

సాగర్ రూపాయి బిళ్లని పైకి ఎగర వేశాడు. ఏం పడిందో అనసూయకి కన్పించలేదు. చూడలేదు కూడా. పడిన నాణెం వైపు ఉత్సాహంగా పరుగెత్తి వెళ్లిచూసిన కొడుకులూ, కోడళ్లే కన్పించేరు.

❀ ❀ ❀

ఇంకా తెల్లవారలేదు. తెల్లవారితే ప్రయాణం. ఆ రాత్రి అనసూయ నిద్రపోలేదు. వెంకట్రావు కళ్లు మూసుకున్నాడంతే. అనసూయ ఇందాకిందాకే పూర్తిగా తేరుకుంది. తేరుకొని ఆలోచించింది. ఆలోచనల్ని ఒక మార్గంలోకి మళ్లించింది. భర్తను లేపి చెప్పింది.

'నీకొచ్చిన ఆలోచన నాకూ వచ్చింది. నీకు వస్తుందో లేదో అని ఆగాను. నీకు నచ్చుతుందో లేదో అని అనుమానించేను'.

దెబ్బతిన్నట్లు చూసింది అనసూయ.

"నీది తల్లిమనసు. అదెప్పుడూ మరింత మెత్తబడుతుందేమో గానీ, ఏమాత్రం గట్టిపడదు. వాళ్లెలాంటివారైనా కొడుకులు కళ్లముందుండాలని ఆశ పడుతుంది. కోపంలో ఆ ఆశ ఎగిరిపోయినా మనసు చల్లారేక అది మళ్లీ ఎగిరొచ్చి గుండె కొమ్మ మీద వాలుతుంది. దాన్ని విదిలించి కొట్టడం ఇష్టం లేకే నేను పైకి అనలేదు'.

'ఏవండీ. మీరన్నది నిజమే. ఆ ఆశ నాకు లేకపోలేదు. కాని ఆ ఆశ కంటే మీ నీడ నాకు ముఖ్యం. నేను ముందు మీ భార్యని. తర్వాతే వాళ్లమ్మని'.

'అయితే నీ ఇష్టం.'

❀ ❀ ❀

తెలతెలవారుతుండగా తలుపు తట్టిన చప్పుడయ్యింది. తలుపు తెరిచింది అనసూయ. గుమ్మంలోంచి లోపలికి అడుగు పెట్టిన కొడుకులిద్దరూ ఆ గదిని చూసి ఆశ్చర్యపోయారు.

ఆగదిలో ఓ మూలనున్న మూటల్లో కొన్ని విప్పి ఉన్నాయి. అందులో ఉన్న సామాన్లు కొన్ని విప్పి ఉన్నాయి. అందులో ఉన్న సామాన్లు ఆ గదిలో ఎప్పటిలా సర్దేసి ఉన్నాయి. అనసూయ అప్పటికే స్నానం చేసేసింది. దేవుడికి పూజ కూడా చేసేసింది. వెంకట్రావు చాప మీద గోడకు ఆనుకొని కూర్చొని పేపరు చదువుకుంటున్నాడు.

'అమ్మా. ఇదేమిటి? మూటలు విప్పేసి ఉన్నాయేంటి?'

'నేనే విప్పేను. ఆశ్చర్యంగా ఈ గదిలో

సామాన్లు ఇక్కడ పెట్టిన మూటల్లోనే ఉన్నాయి. ఇవన్నీ మీ నాన్న సర్దేరు.'

'ఎందుకూ?'

'మేం మీతో రావడం లేదు.'

'అదేంటమ్మా?'

'అవును మేమిక్కడే ఉండిపోతున్నాం.'

'సామాన్లు పేక్ చేసేశాం. వేన్లు మాట్లాడేశాం.'

'మా సామాన్లు ఇక్కడే ఉన్నాయి. పంచుకున్న సామాన్లు పట్టుకు పోండిరా. సామాన్లు వేన్లు నిండిపోయేంతగా లేవుగా. ఈ గదిలో ఉన్న సామాన్లలో ఏవైనా అవసరమైతే పట్టుకెళ్లండి కాదనం.'

'మరి రైలు టికెట్లు రిజర్వేషన్ చేసేశాం కదా!'

'మా ఇద్దరి టికెట్లు రద్దు చేసేయండి. నష్టం డబ్బు రూపంలో కొద్దిగా ఉన్నా, రద్దు చేసుకొనే వీలున్న ప్రయాణంరా ఇది. కానీ మేమిప్పుడు ఆగిపోతుంది - ఎవరూ రద్దు చేసుకోలేని చివరి ప్రయాణంలో మీ నాన్నను నేను కళ్లెదుట చూసుకోవడానికి. చివరి వీడ్కోలు తీసుకోడానికి.'

'మా దగ్గర ఉంటే మీకెలాంటి లోటూ ఉండదనే కదమ్మా మిమ్మల్ని రమ్మంటుంది!'


'కొడుకులు తల్లిదండ్రులిద్దర్నీ తమ వద్ద ఉంచుకోవాలను కుంటారు. కానీ మీలో మీరు పోట్లాడుకుని మీరు విడిపోతూ మమ్మల్ని వేరు చేయాలను కుంటున్నారు. పురిటికి భార్యలు కన్న వాళ్లిళ్లకు వెళితే వారానికో మారు పరుగెత్తిన మీరు, సెలవుల్లేక ముందుగా భార్యల్ని అత్తగారింటికి పంపి పండగెప్పుడొస్తుందా అని ఉవ్విళ్లూరిన మీరు అమ్మానాన్నలు బతికినన్నాళ్లూ ఎలా విడివిడిగా ఉండగలరని ఆలోచించండిరా. కలిసి బతికిన ప్రతి సంవత్సరమూ బంధం మరింతగా పెనవేసు కుంటుందని అర్థం చేసుకోండిరా. విడిగా బతకడం మాకు వీలయ్యే పనికాదు.'

'ఇంతలోనే చాలా ఆలోచించేసుకున్నారు. మీ ఆలోచనలు మీవే గానీ మా ఆలోచనలు అర్థం చేసుకోరా?'

'అర్థం చేసుకున్నాంరా. మా ఇద్దర్నీ మీ ఇద్దరి దగ్గరా విడివిడిగా ఉండమంటున్న దెందుకో మాకు అర్థమయ్యిందిరా. నాన్న బయటి పనులు చూసుకుంటే కొడుక్కి సులువు. వరండాలో కాపలా కుక్క అక్కర్లేదు కూడా. తల్లి ఇంటి పని చేస్తే కోడలికి సులువు. పనిమనిషికూడా అక్కర్లేదు. ఆరు నెలలు భార్యాభర్తలిద్దరూ సుఖపడ్డమో, ఇద్దరూ ఇబ్బంది పడ్డమో కంటే ఆరు నెలల కొకరు సుఖపడ్డం మంచిది కదా అన్నది మీ ఆలోచన కాదంటారా?'

'డీప్‌గా ఆలోచిస్తే ప్రతి నిర్ణయానికి వంక వెదకొచ్చమ్మా.'

'మమ్మల్ని పోషించాల్సి బాధ్యత మీకుంది. కారణాలు వెదకాలన్న వంకర ఆలోచన వస్తే మీకు రావాలి గానీ, మీ నీడలో బతకాల్సిన మాకెందుకొస్తుందిరా. తప్పించుకోవాలను కొనేవాళ్లు కొడుకులు. తప్పించుకోలేని వాళ్లు తల్లిదండ్రులు.'




'ఇప్పుడు మీరు చేస్తుంది తప్పించుకోవడం కాదా?'

'అవునురా. మాది తప్పించుకోవడమే. బంధాలు తెంచుకొని తలపుల్లోనే కలుపుకోవాలన్న పరిస్థితిని తప్పించుకోవాలనే నేనిలా మాట్లాడుతుంది. అందుకే నాన్న మౌనంగా ఉండిపోయిందీనూ.'

'బంధాలు, అనుబంధాలూ అనుకుంటే ఈ రోజుల్లో మనుగడ కష్టమమ్మా.'

'మీరు అనుకోకండి. మీ పిల్లల్తో, భార్తల్తో అనుబంధాలు పెంచుకోకండి. రాళ్లల్లాగా దొర్లిపోండి. యంత్రాల్లా కదిలిపోండి. అది మీ ఇష్టం కానీ మేం అలా ఉండలేం. రాళ్లని కరిగించే ప్రేమానురాగాల్లో పెరిగాం. తిరిగాం. మమ్మల్నిలా వదిలేయండి. వదిలేసి వెళ్లిపోండి.'

'అంతేనా?'

'అంతే!'

ఆ తర్వాత సాగర్, విజయ్ ఏమీ మాట్లాడలేదు. ఈ సంభాషణ మొదలైన కాసేపట్లోనే వచ్చిన వాళ్ల భార్యలిద్దరూ వాళ్ల వెనుకే నిల్చున్నారు. అన్నీ విన్నారే గానీ ఏమీ మాట్లాడలేదు. అనసూయ అక్కడ్నుంచి వెళ్లిపోయి రోజూలాగే ఇంటి పనిలో పడిపోయింది. వెంకట్రావు మళ్లీ పేపరు చదవడంలో పడిపోయాడు.

రెండు వేన్లు అప్పుడే ఆ ఇంటి ముందాగేయి. మరో గంటలో ఆ ఇంటిలో ఓ ముసలి జంట ఒంటరిగా మిగిలి పోయింది!

అప్పుడంది అనసూయ 'ఏమండీ మనం చేసింది తప్పుకాదు కదూ?'

'తప్పే వాళ్ల దృష్టిలో. నా దృష్టిలో మాత్రం కాదు.'

'మీకు బాధగా లేదూ?'

'ఎందుకుండదు? వాళ్లు కన్నవాళ్లు కదా. విదిలించుకొని మరీ వెళ్లిపోయారు కదా.'

'ఒక రైల్వేస్టేషన్లో ఎదురెదురు ఊళ్లనుండి వచ్చిన రెండు రైళ్లు ఆగుతాయి. ఒక రైల్లో ఒక ముసలాయన ఉంటాడు. రెండో రైల్లో ఒక ముసలామె ఉంటుంది. వాళ్లలా ఆరు నెలలకోసారి అవే రైళ్లు ఎక్కుతారు. అదే స్టేషన్లో ఆ రెండు రైళ్లూ ఎదురవుతాయి. ఆ ముసలాళ్లిద్దర్నూ నలభయ్యేళ్లు కాపురం చేసిన భార్యా భర్తలు.'

అనసూయ ఆగితే వెంకట్రావు అందుకున్నాడు.

'ఆగిన ఆ రెండు రైళ్లలోంచీ ఇద్దరూ దిగుతారు. ఒకర్నొకరు వెదుక్కుంటారు. తీరా ఎదురుపడ్డాక గొంతు గుండెలో ఎక్కడో చిక్కుపోయి ఏమీ మాట్లాడుకోలేరు.'

వెంకట్రావు ఆగిపోయాడు. అనసూయ మాట్లాడింది.

'అతి కష్టం మీద గొంతు పెగుల్చుకొని ఏదో మాట్లాడుకొనేంతలో వాళ్లెక్కిన రైళ్లలో ఒక రైలు కూతపెట్టి కదులుతుంది. నలభయ్యేళ్ల కాపురాన్ని ప్లాట్‌ఫాం మీద వదిలేసి తడబడే అడుగుల్తో రైలెక్కి...'

అనసూయ మాట్లాడలేక పోతుంటే వెంకట్రావు మొదలు పెట్టేడు.

'రైల్లోంచి తల బయటకు పెట్టి చూస్తే, అవతల వ్యక్తి మసగ్గా కన్పిస్తే, వణికే చేతుల్తో కళ్లజోడు తీసి పెట్టుకొని చూడబోతే'

అనసూయ వణికే పెదవులతో అంది.

'కళ్లనీళ్లు వాళ్లకా అవకాశం ఇవ్వదు. ఒకరైలు సాగిపోతుంది. ప్లాట్‌ఫాం మీద ఒంటరిగా మిగిలిపోయిన వ్యక్తి గొణుక్కుంటున్నట్లుగా ఏదో అనుకుంటుంటే అంతలో రెండో రైలు కూత పెడుతుంది. పుట్టెడు దుఃఖంతో సాగని అడుగుల్ని ఉస్సురని వేసి ఆ రైలెక్కక తప్పదు!'

వెంకట్రావు గొంతు పూడుకు పోతున్నా మాట్లాడేడు.

'ఒక్కోసారి ఆ రైళ్లలో ఏదో రైలు ఆ స్టేషన్‌కి టైముకి రాదు. ఆ మర్నాడో, ఆ తరువాత రోజో రైళ్లు రెండూ మళ్లీ ఆ ప్లాట్ ఫారం మీద్నే కలుసుకుంటాయి. కానీ ఆ వృద్ధ దంపతులు మళ్లీ అలా కలుసుకొనేది మరో ఆర్నెల్ల తర్వాతో. ఆ ఆర్నెల్ల తర్వాతొచ్చే ఆర్నెల్లకో.'

అప్పటికి అనసూయ భోరున ఏడ్చేసి వెంకట్రావు గుండెల మీద పడి పోయింది. వెంకట్రావు అనునయంగా ఆమె వీపు నిమురుతూ అన్నాడు.

'అంత భయంకరమైన సంఘటన మన కళ్లల్లో కదలాడుతున్నదంటే మనకి కొడుకుల కంటే నేనంటే నీకే, నువ్వంటే నాకే ఎక్కువ ప్రేమ, నమ్మకం అని అర్థం. వాళ్లు వెళ్లిపోయారన్న బాధ కంటే మనం విడిపోలేదన్న ఆనందమే ఎక్కువైనప్పుడు ఎందుకు అనసూయా నువ్వింకా దిగులుగా ఉంటావు. లే. ఈ జీవితం మనది. మనమే అనుభవిద్దాం.'

అప్పుడు కొద్దిగా తేరుకుంది అనసూయ.

'పాల ప్యాకెట్లు తీసుకు రావడానికి వెళ్తాను. ఈ లోగా టిఫిన్‌కి ఏర్పాటు చెయ్యి. ఆకలిగా ఉంది.'

'వచ్చేప్పుడు లేత వంకాయలు చిన్నవి తీసుకురండి. మీకిష్టమైన ముద్దొంకాయ కూర వండుతాను.'

●